


# సిగ్గుతెరలు

భమిడి వెంకటేశ్వర్లు

**ఇంట్లో** కూర్చుంటే ఆలోచనలు మునురుతున్నాయి. అందుకే పది గంటలు అయ్యేసరికల్లా ఆఫీసుకు చేరుకుంది రామసీత. నాలుగు రోజులనుంచీ ఆమె మనసు చికాగ్గా ఉంటోంది. కారణం లేకపోలేదు. అర్జంటుగా అయిదు వందలు పంపమని తండ్రీ నాలుగు రోజుల క్రితం టెలిగ్రామ్ ఇచ్చాడు. అదే ఆమె ప్రస్తుత సమస్యకు, ఆలోచనలకు కారణం. తన దగ్గర అంత డబ్బు ఉండదని, తనైనా అప్పు చేయవలసిందేనని తండ్రికి తెలియకపోలేదు. మరి తెలిసే టెలిగ్రాఫ్ ఇవ్వటంలోని తండ్రి ఉద్దేశం రామసీతకు బోధపడటంలేదు.

రెండు రోజులక్రితం తండ్రి మళ్ళీ ఉత్తరం రాసేడు— చెల్లెలికి, తమ్ముడికి స్కూలు ఫీజులు కట్టాలని, తల్లికి వైద్యం చేయించాలని, కిరాణావాడు పాత బాకీ తీరిస్తేనేగాని సరుకులు ఇవ్వనంటున్నాడని.

రామసీత తండ్రి రిటైర్డు స్కూలు టీచరు. ఆయనకు నూట యాభైదాకా పెన్షను వస్తుంది. ఆయన, భార్య, ఇద్దరు పిల్లలు ఆ ఊళ్ళో ఉంటున్నారు. పోతే రామసీతకు రెండేళ్ళ క్రితం నగరంలో ఓ ప్రభుత్వ ఆఫీసులో ఎల్డీసీగా ఉద్యోగం వచ్చింది. తనకు పాతికేళ్ళ వయసుంటుంది. పెద్దగా అందగత్తె కాదు. అలాగని అనాకారి కాదు. వయసొచ్చింది కాబట్టి అందంగానే కనబడుతుంది ఆమె. అందుకేనేమో ఆఫీసులో కుర్ర ఉద్యోగులు ఆమెతో మాట్లాడేందుకు ఎగబడుతుంటారు. జోకులు వేస్తూ ఉంటారు. వాటివెనుక ఉద్దేశం రామసీత అర్థం చేసుకోగలదు.

ఆమె కొచ్చే ఎనిమిది వందల జీతంలో నగరంలో కాలక్షేపం ఎలా చేయగలుగుతుందో తనకే ఆశ్చర్యంగా ఉంటుంది. రెండు వందలు తండ్రికి పంపిస్తుంది. మిగిలినదానితో ఇంటి అద్దె, బస్సు చార్జీలు, భోజనం. ఎప్పుడైనా ఒకటో, రెండు సినిమాలు...ఎంత క్లుప్తంగా ఖర్చు పెట్టినా కనీసం పాతిక రూపాయలైనా అప్పు చేయవలసివస్తోంది. తండ్రికి తక్కువ మనియార్డరు చేస్తే, వారికి జరుగుబాటు కష్టమయిపోతుంది. కాబట్టి తప్పనిసరిగా జీతం రాగానే తండ్రికి రెండు వందలు ఎమ్.ఓ. చేయటం రామసీతకు అలవాటయింది.

ఇప్పుడు అయిదు వందలు కావాలి. ఎలగా?

ఆ విషయాన్నే లేడీ కొలీగుతో ప్రస్తావించింది రామసీత.


"ఏమిటోయ్! అంత బెంగ దేనికి? ఎదురుగా రామారావు నుంచుకుని ఆఫ్టరాల్ అయిదు వందలకోసం తల పగులకొట్టుకోడమా? మన ఆఫీసులో ఎందరో ఆడవాళ్ళకు అతను పాల సముద్రం లాంటివాడు. కామధేనువు. కాబట్టి, అతని దగ్గర కెళ్ళు. నీ అవసరం తీరుతుంది. అతని కవకాశం కలుగుతుంది. భయపడకు. గో ఎహెడ్!" సలహా ఇచ్చింది అనుభవజ్ఞురాలైన స్నేహితురాలు.

రామసీతకు ఆ సలహా నచ్చలేదు.

ఆమె మళ్ళీ ఆలోచిస్తోంది.

ఆఫీసులో దాదాపు మూడు, నాలుగు వందలమంది ఆడవాళ్ళు ఉన్నారు. వారంతా ఆధునికంగా...రకరకాల బట్టలు ధరిస్తారు. నగలు పెట్టుకుంటారు. నాగరికత వారిలోనుండే పుట్టిందా అనిపిస్తుంది. వారిలో చాలామంది రామారావు దగ్గరకు రావటం రామసీత చూస్తూనే ఉంటుంది. అతని గురించి అంతా చెడుగా చెప్పుకుంటారు. చెడులోనుంచి మంచి పుట్టిందా, మంచికోసం చెడు ఉందా అని ఆమె అర్థం చేసుకునే ప్రయత్నం ఎప్పుడూ చేయలేదు.

కాని అయిదు వందలకొసం రామారావు దగ్గరకు వెళ్ళక తప్పదు అనుకుం దామె. ఎవరికైనా తెలిస్తే...చూస్తే...తన జీవితం ఏమవుతుంది! ఎంత గుట్టుగా, జాగ్రత్తగా ఉన్నా ఇటువంటి విషయాలు ఇట్టే నలుగురికీ తెలిసిపోతాయి. ఓసారి ఎప్పుడో అను



కుంది రామసీత-ఒక్కసారి రామారావు దగ్గర కెళ్ళాలని! అది అవకాశంగా తీసుకుని అతను తరుచు ఆహ్వానిస్తే! మగాడిలాగా ఆడదీ దిగజారిపోవటమా! బ్రతికేందుకు ఎన్నో చిట్కాలున్న నాగరిక ప్రపంచం ఇది!

ఒక్కసారి అలవాటుపడితే—ఇంతే సంగతులు.

రామసీత గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఎంతో మంది ఇట్టే ఒళ్ళో వాలిపోతారు. అందుకేగా తనతో ఇంతమంది మాట్లాడుతున్నది! వారి కళ్ళల్లో, మాటల్లో, నవ్వుల్లో దాహం ఉంది. కోరిక ఉంది. మరేదో ఉంది...

తనిప్పుడు అయిదు వందలు ఎలా సంపాదించాలి?

ఎప్పుడో ఓసారి ఇంటి కెళ్ళినప్పుడు తండ్రి మాటల మధ్యలో అన్నాడు—ఒక్క మనిషికి నగరంలో ఎంత ఖర్చు అవుతుందో లెక్కలేసి చెప్పాడు. ఎంత లేదన్నా అరవై, డెబ్బైదాకా దాచుకోవచ్చు నన్నాడు. తల్లికి, తండ్రికి పంపించటం ఇష్టం లేనివారే, ఎంత డబ్బూ చాలదని అంటారని అన్నాడు తండ్రి. అందుకే తండ్రితో ఆ విషయం గురించి అంతగా వాదించలేదు.

రామసీత అద్దె తక్కువగా ఉంటుందని నగరానికి దూరంగా ఉన్న కాలనీలో ఉంటోంది—అవుట్ హౌస్‌లో. ఖరీదైన చీరలు కట్టుకోవాలనుంటుంది. కాని డబ్బు సర్దుబాటు ఎలా చేయాలి? తనని కని, పెంచి పెద్దచేసిన కన్నవాళ్ళకోసం, తన తరువాత పుట్టిన చెల్లెలు, తమ్ముడు అభివృద్ధికోసం కొన్ని సరదాలు, కోరికలు వాయిదా వేసుకుంటోంది. అందుకే స్వార్థంకోసం బతకాలనుకోవటం లేదు.

ఇంతకీ తను అయిదు వందలు ఎలా సంపాదించాలి?

రామసీతకు ఉద్యోగం రాకముందు పది, పదిహేను సంబంధాలొచ్చాయి. కాని పెళ్ళిచూపులు పెద్ద ప్రహసనంలా తయారవుతున్న నేటి పెళ్ళి వ్యవస్థ ఓ పెద్ద ఫార్సు...వరుళ్ళో, వారిని కన్నవాళ్ళో కోరే హిరణ్యాక్ష వరాలు ఆమె తండ్రి తీర్చకపోవటంతో రామసీతకు ఏ సంబంధమూ కుదరలేదు. ఈ జన్మలో మగపిల్లల్ని కన్నవాళ్ళు దేవుడికి అభిషేకాలు, పూజలు బాగా చేసి ఉంటారు క్రితం జన్మలో. అందుకే ఈ జన్మలో అడుక్కోవటం ఎక్కువగా ఉంటోంది. దానికి కట్నం అని కొందరు పేరెడితే, మరి కొంతమంది లాంఛనాలు పేరుని తగిలించారు. ఎవరి తాహతుని బట్టి వారు ఇచ్చుకుంటున్నారు...ఆడపిల్లల్ని వదిలించుకుంటున్నారు-వారిని కన్న నేరానికి. అందుకే రామసీత ఈ "జాతి"మీద జాలిగా ఉంటుంది. సానుభూతి చూపెడుతుంది. వారిని కసిరికొట్టి పొమ్మంటే ఎలా బతుకుతారు? అనుకుంటోంది. వారి పరిస్థితులను సహృదయంగా అర్థం చేసుకోవాలంటుంది. కాని ఇవేమీ తన తండ్రికి లేకపోవటంతో కథ మొదటికే వస్తుంది. అలా అని తన దురదృష్టాన్ని తిట్టుకోదు.

రామసీత కో పెళ్ళి సంబంధం ఎప్పటికీ గుర్తుంటుంది.

ఆనాడు తనని చూసిన వరుడు తల్లి, తండ్రి, ఆరుగురు సోదరులను, ముగ్గురు చెల్లెళ్ళను తీసుకువచ్చాడు. వారిని చూసి రామసీత భయపడలేదు. కంగారు పడలేదు. 'ఇంట్లో కాఫీ, టిఫిను చేసుకునేందుకు బద్ధకించారేమో, పాపం...అందుకే సైన్యంతో పెళ్ళిచూపులంటూ బయలుదేరారు' అనుకుంది.

వరుడికి డిగ్రీ ఉంది. బాంకు ఉద్యోగం ఉంది. పాతిక వేలు కట్నం అడిగాడు. అయిదు వేలు ఆడపిల్లల లాంఛనాలు ఇమ్మన్నాడు.

ఆమె తండ్రి తన అశక్తత తెలిపాడు.

ఇరవై ఇమ్మని కబురు చేశారు ఎవరిచేతనో.

అప్పుడూ తండ్రి "నో" అనేశాడు.

పదిహేను రోజుల తరువాత రామసీతకు ఉద్యోగం వచ్చింది.

కాబట్టి పదిహేను ఇమ్మని కబురు చేశారు, ఈ విషయం తెలిసి. ఈసారి రామసీత చేసుకోనంది.

ఎప్పుడో ఆ వరుడు రోడ్డుమీద కలిశాడు.

"బాంకు ఉద్యోగిని కదా...కనీసం నా విలువ పదిహేను వేలు చేయదా?" అని అడిగాడు ఆమెను.

రామసీతకు కోపం వచ్చింది.

"బాంకు ఉద్యోగి అయితే బాంకు డబ్బుకు వారసులవుతారా? అయినా మీలాటివారిని కట్టుకుని నేను ఏం సుఖపడగలను? మీకు డబ్బే ముఖ్యం. మరికొంత కాలం ఆగితే, ఇంకా రేటు పెరుగుతుంది. ఏ అమెరికా అమ్మాయినో, ఇరాన్ పిల్లనో చేసుకుంటే బోలెడంత ఇస్తారు. దాంతో మీ చెల్లెళ్ళ వివాహాలు అవుతాయి. మీకున్న కొబ్బరాకుల ఇల్లు కనీసం పెంకుటిల్లుగానైనా మారుతుంది. అవకాశం వస్తే బాంకు అకౌంట్లు తారుమారు చేసి స్వాహా చేయవచ్చు...ఈ రోజుల్లో ఎన్ని జరగటం లేదు ఇలాగ?" అందామె.

ఆ వరుడు కోపగించుకోలేదు. 'పాపం! పెళ్ళికావటం లేదని ఇలా మాట్లాడుతోంది' అనుకున్నాడు.

అయిదు వందలకోసం రామారావు దగ్గిరకెడితే ఏమవుతుంది? ఎవరికి తెలుస్తుందని? తప్పేమిటి? అనుకుంది రామసీత మరోసారి. ఈసారికి ఈ ఒక్క తప్పు చేసి, దేవుడి ఎదురుగా నిలబడి క్షమించమని చెంపలు వాయించుకుంటే సరి. దేశంలో ఎంతోమంది ఎన్నో తప్పుడు పనులు చేస్తున్నారు. అవి వారి దృష్టిలో తప్పు కాకపోవచ్చు. తప్పు చేసిన వాడెప్పుడూ చేసిన తప్పును సమర్థించుకునేందుకే ప్రయత్నిస్తాడు. తనూ అదే చేస్తే సరి... ఈ రామారావు తప్ప మరొకరు తనని ఆదుకోలేరు...మరో గత్యంతరం లేదు.

×× ×× ××

రామారావుకు ముప్పయ్ అయిదేళ్ళ వయసుంది. ఉద్యోగంలో పదిహేనేళ్ళ అనుభవం ఉంది. బ్రహ్మచారి. విలాస పురుషుడు. ఆఫీసులో ఆడవాళ్ళు అతనంటే సరదాపడతారు. విపరీతంగా సిగరెట్లు కాలుస్తాడు. సాయంత్రం తప్పనిసరిగా మందు కొడ్తాడు. గుర్రప్పందేల కెడతాడు. స్నేహితులతో కలసి పేకాడుతాడు. అమ్మాయిలను వెంటబెట్టుకొని షికార్లకు, సినిమాలకు వెడతాడు. తన వయసుని, డబ్బుని ఆడవాళ్ళకోసమే త్యాగం చేస్తుంటాడు. తన కొచ్చే జీతం కేవలం సిగరెట్లు, మందుకే సరిపోతుంది.

పైఖర్చులు, అవసరాలకు తండ్రి ఇచ్చిన ఆరేడు లక్షల నిధినుంచి తీస్తుంటాడు.

ఇదంతా రామ సీతకు తెలుసు.

అతనితో పరిచయం ఉన్న ఆడవాళ్ళ గురించి తెలుసు.

గతంలో వారే సలహా ఇచ్చారు. అతనెప్పుడూ ముందుకు రాలేదు. అది అతనికి అంత కష్టమైన పని కాదని రామ సీతకు తెలుసు. ఆమెతో అప్పుడప్పుడు మాట్లాడతాడు. వెకిలితనం ఉండదు ఆ మాటల్లో. ఆ కళ్ళలో కోరిక కనిపించనీయడు. పెదవులపై నరదాని తెచ్చుకోడు.

'తనంటే గౌరవమేమో?' అనుకుంటుంది రామ సీత.

తన అవసరాన్ని అతనికి చెప్పుకోవాలనుకుంటోం దామె.

చిన్న తప్పు పని చేసి, ఈసారికి డబ్బు పంపించాలి. మరెప్పుడూ ఈ పని చేయకూడదనుకుంది.

లంచ్ టైమ్ అయింది. రామారావు సీట్లోనే కూర్చున్నాడు.

రామ సీత అతన్నే చూస్తోంది, ఎలా అడగాలి అని ఆలోచిస్తూ.

ఇంతలో ఎవరో ఇద్ద రాడవాళ్ళు అతని దగ్గర కొచ్చేరు. వారికి చెరో ఏభై రూపాయల నోటు ఇవ్వటం రామ సీత చూసింది.

'ఉన్న డబ్బు వారికే ఇచ్చేస్తుంటే, తనకేం మిగులుతుంది? తీరా తనకు డబ్బు ఇచ్చేందుకు తిప్పుతాడేమో! ఎలాగా?' రామ సీత మనసులోని ఆలోచనలు...ఆరాటపడుతోం దామె.

రామారావు సీటు దగ్గరకు నడిచింది రామ సీత.

"లంచ్ కెళ్ళరా?" ఆమె పలకరించింది.

"లేదండీ. మనసు బాగాలేదు" అన్నాడు రామారావు.

"అదేమిటి—వింతగా మాట్లాడుతున్నారే?" ఎదురు ప్రశ్న వేసింది ఆమె.

రామ సీత రాకలోని ఆంతర్యాన్ని గ్రహించాడు రామారావు. ఇది అనుభవంలో నేర్చుకున్నా డతను. తను ఏదో కోరే ప్రయత్నంలో ఉందనుకున్నాడు.


"సాయంత్రం మీతో కొంచెం సేపు పనుంది. వీలవుతుందా?" అడిగింది.

రామారావు ఆలోచనలో పడ్డాడు. తనకున్న పనులు గుర్తు చేసుకుంటున్నాడు.

"తొమ్మిది గంటలకైతే వీలవుతుంది. కాని అప్పుడు మీరు రాలేరు. కాబట్టి రేపు ఆఫీసుకు రాగానే చెప్పండి" అన్నా డతను.

"లేదండి. చాలా అర్జంటుగా కలవాలి. ఎంత రాత్రయినా ఫరవాలేదు. ఆ పనయ్యాకే ఇంటి కెడతాను. లేదంటే రాత్రికి ..." తల వంచుకుని భయంతో సిగ్గు పడుతూనే చెప్పింది రామ సీత.

"మీకు నా గురించి తెలిస్తే ఇలా మాట్లాడ




లేరు. బైదిబై, విషయం ఏమిటి?" అన్నాడు రామారావు.

"నా అవసరాన్ని మీరే తీర్చాలి. దయచేసి నన్నర్థం చేసుకోండి" అంది రామ సీత క్లుప్తంగా ఈమాత్రం చెపితే మిగిలింది అర్థం చేసుకోగల డన్నట్లుగా.

"ఇంతకీ మీ కేం కావాలి?" అడిగా డతను.

"ఇప్పుడు చెప్పను. సాయంత్రం మీ కోసం బస్టాపులో ఎదురు చూస్తుంటాను. అక్కడ చెపుతాను" అంది రామ సీత తన సీటు కెడుతూ.

"సరే, అయితే." సిగరెట్ వెలిగించాడు రామారావు.

××× ××

రామారావు,రామ సీత ఎదురుగా ఉన్న హొటల్లోకి నడిచారు.

"రూము తీసుకోవలసింది. ఎంత సేపు ఉన్నా ఇద్దరికీ క్షేమంగా ఉంటుంది" అనాలనుకుంది ఆమె.

"మీరేం తీసుకుంటారు?" అడిగా డతను.

"నా కేంవద్దు. మీరు తీసుకోండి—ఫరవాలేదు" అంది రామ సీత.

రామారావు రెండు కాఫీలు తెమ్మని చెప్పాడు.

"ఇప్పుడు చెప్పండి, ఏమిటి విషయం?" అడిగా డతను.

ఈ లోగా కాఫీలు తెచ్చాడు బేరరు.

"ఏం లేదండి. నాకు అర్జంటుగా అయిదు వందలు కావాలి. మీరు తప్ప ఎవరూ నాకు తెలియదు. ఇంత డబ్బు ఎవరిస్తారు నన్ను చూసి?" అంది రామ సీత తల వంచుకుని.

"మళ్ళీ ఎప్పుడిస్తారు?" అడగా లనుకున్నా డతను.

"మీ బాకీ ఎప్పటికి తీర్చగలనో ఖచ్చితంగా చెప్పలేను. కానీ...అంతవరకూ..." రామ సీత అంతకన్నా చెప్పలేకపోయింది.

రామారావు ఆలోచిస్తున్నాడు.

"మీ తృప్తే నా తృప్తి. నా అవసరం తీర్చారు కాబట్టి, మీ..." సిగ్గుపడుతూ చెప్పిం దామె.

రామ సీతలో సన్నగా వణుకు...భయం...రామారావు ఆమెనే గమనిస్తున్నాడు. పర్సు తీసి అయిదు నూరు రూపాయల నోట్లు ఆమె కిచ్చాడు. నోట్లు పర్సులో పెట్టుకుంది తను.

"చాలా థాంక్స్. మరెప్పుడు రమ్మంటారు?" అం దామె నెమ్మదిగా.

రామారావు ఆ మాటల్లోని భావాన్ని గ్రహించాడు.

"ఓ విషయం చెప్పనా?" అన్నాడు రామారావు.

"చెప్పండి. నేనేమీ అనుకోను" అంది ఆమె.

"పాతికేళ్ళ వయస్సున్న నా చెల్లెలు నాలుగేళ్ళ క్రితం చనిపోయింది. ఆమె పేరూ మీ పేరే...రామ సీత. మిమ్మల్ని చూస్తుంటే నా చెల్లెలు గుర్తు కొస్తూ ఉంటుంది." రామారావు తల వంచుకుని అంటుంటే, రెండు కన్నీటి బొట్లు టేబులు మీద పడ్డాయి.

రామ సీత సిగ్గుతో తల దాచుకుంది. ఆమె కళ్ళలో కదిలే కన్నీటి తెరల మధ్య ఏదో కనబడని అవ్యక్త భావం.

"పదండి...జనరల్ పోస్టాఫీసులో మనియర్డర్లు తీసుకునేందుకు ఇంకా టైముంది. ఆలస్యం దేనికి?" అంటూ లేచాడు అతను.

రామారావు ముందు నడుస్తుంటే, అతన్ని అనుసరించింది రామ సీత. × ★